సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ⸱ 12 ⸱ ఫిబ్రవరి ⸱ 2025



రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి
సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గల పాల్వంచ లోని కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం విద్యుదుత్పత్తిలో దూసుకుపోతోంది. 8లో



సమ్మక్క జాతర షురూ..
గిరిజనుల ఆరాధ్య దేవతలైన సమ్మక్క, సారలమ్మ జాతర కరకగూడెం మండలం చిరుమళ్లలో మంగళవారం ప్రారంభమైంది. 8లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం
36°/ 18°
జిల్లాలో బుధవారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రం అవుతుంది. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పిల్లల సంరక్షణపై శ్రద్ధ పెట్టండి
జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



ఆశ్రమంలో పిల్లలతో భానుమతి

కొత్తగూడెంటౌన్: అనాథాశ్రమంలో పిల్లల సంరక్షణ, విద్య, ఆహారం విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి నిర్వాహకులకు సూచించారు. పట్టణ పరిధిలోని బూడిదగడ్డ బస్తీలో గల శ్రీ స్నేహలత – సంధ్యాలత, రైటర్‌బస్తీలోని శ్రీసత్యసాయి అనాథ శరణాలయాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆశ్రమాల్లోని కిచెన్, ఫ్లోర్, స్టోర్ రూంలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, న్యాయవాది మెందు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు అండర్ - 18 అథ్లెటిక్స్ ఎంపికలు

పాల్వంచ: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్వంచలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి అండర్ –18 అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్లలోపు బాల, బాలికలకు 100, 400, 800, 1,500, 3,000, 5,000 మీటర్ల పరుగు పందెం, హై జంప్, లాంగ్ జంప్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఈనెల 18,19 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 13వ తేదీ ఉదయం తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రిటర్నింగ్ అధికారులకు నేడు శిక్షణ

చుంచుపల్లి: సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వర్తించే రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఐడీఓసీలో బుధవారం ఉదయం 10 గంటలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 22 జెడ్పీటీసీ స్థానాలకు 22 మంది ఆర్‌ఓలు, ఎంపీటీసీ స్థానాలకు 80 మంది ఆర్‌ఓలు, మరో 80 మంది ఏఆర్‌ఓలకు, 24 మంది రిజర్వ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కాగా 22 జెడ్పీటీసీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

చుంచుపల్లి: జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మంగళవారం జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాలో 6,81,174 మంది ఓటర్ల కోసం 1,279 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

'పెదవాగు'పై అసెంబ్లీలో మాట్లాడుతా
పోలవరం ఎమ్మెల్యే బాలరాజు

అశ్వారావుపేట: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉమ్మడి పరిధిలోని అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణం అంశంపై త్వరలో జరిగే ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. మంగళవారం అశ్వారావుపేటకు వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గతేడాది కురిసిన భారీ వర్షాలు, వరద ప్రవాహంతో పెద్ద ఎత్తునగండి పడిన పెదవాగు ప్రాజెక్ట్ నిధుల గురించి ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులతో మాట్లాడుతానని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రానున్న మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, గత నెలలో 41 కాంటూర్ పరిధిలో ఉన్న నిర్వాసితులకు నష్ట పరిహారం ప్యాకేజీని వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మిగిలిన వారికి త్వరలోనే చెల్లించేలా ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. స్థానిక జనసేన నాయకురాలు ఉమాదేవి కుమారుడు చిరంజీవి అగ్నిప్రమాదంలో గాయపడగా.. తొలుత ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ అంకత మల్లికార్జున్‌రావు, రవికుమార్, దేగల రాము, కురిశెట్టి నాగబాబు ఉన్నారు.

కదలిక వచ్చేనా..?



సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ వద్ద పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

దాదాపు 21 నెలలుగా ఆగిన సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మాణ పనుల్లో కదలిక వస్తుందనే నమ్మకాన్ని జిల్లా అధికారులు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కేంద్రంతో కూడిన బరాజ్ నిర్మాణంతో పాటు గోదావరి నదీ జలాల వినియోగం తదితర అంశాలపై గతంలో కేంద్ర జలసంఘం అభ్యంతరాలు లేవనెత్తింది. దీంతో ఆ అభ్యంతరాలను నివృత్తి చేసేందుకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) ముందు మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో 'సీతారామ' ఇంజనీర్లు బలమైన వాదన వినిపించారు. టీఏసీ నుంచి సానుకూల ఫలితాలు వస్తే అనుమతుల సాధన సులువవుతుంది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఢిల్లీలో టెక్నికల్ కమిటీ ఎదుట 'సీతారామ' వాదనలు
- ప్రాజెక్టు అనుమతుల సాధనలో అంతులేని జాప్యం
- పదేళ్లుగా కొలిక్కి రాని ప్రాజెక్టు డీపీఆర్
- ప్రాజెక్టు స్వరూపంలో పలుమార్లు మార్పులు చేర్పులు
- మరోసారి టీఏసీ ముందుకు సీతమ్మసాగర్ అంశం

సీడబ్ల్యూసీ అనుమతి తప్పనిసరి..

జీవ నదులపై ప్రాజెక్టులు చేపట్టాలంటే కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతి తప్పనిసరి. దీని ప్రకారం వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను సీడబ్ల్యూసీ నియమించిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ పరిశీలనకు పంపాలి. ఈ కమిటీ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే టెక్నో ఎకనామికల్ అప్రైజల్ వచ్చినట్టుగా భావిస్తారు. అనంతరం కేంద్ర జల్‌శక్తి మంత్రి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు సభ్యులుగా ఉన్న అపెక్స్ కమిటీ నుంచి తుది అనుమతులు రావాల్సి ఉంటుంది. అంతకంటే ముందు సదరు ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుకు గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంటుంది.

రెండేళ్లుగా నలుగుతోంది..

అనేక అవాంతరాలను దాటుకుంటూ వచ్చిన సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మాణాలకు టెక్నో ఎకనామిక్ అప్రైజల్ కోసం 2023 జనవరి 23న కేంద్ర జలసంఘానికి తెలంగాణ సర్కారు డీపీఆర్ సమర్పించింది. ఈ రిపోర్ట్‌ను పరిశీలించిన కేంద్ర జలసంఘం బరాజ్‌లో జల విద్యుత్ కేంద్రం ఏర్పాటుపై పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అప్రైజల్‌ను తిరస్కరించింది.

రాజీవ్ సాగర్ టు సీతమ్మ సాగర్

భద్రాద్రి జిల్లా పరిధిలో సాగునీరు అందించేందుకు రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు మొదట శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ ప్రాజెక్ట్ రద్దయి దీని స్థానంలో సీతమ్మ సాగర్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తలకెత్తుకుంది. రోళ్లపాడు రిజర్వాయర్‌కు గోదావరి నీటిని ఎత్తిపోయడం ద్వారా భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 6.50 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తర్వాత కిన్నెరసాని అభయారణ్యం పేరుతో రోళ్లపాడు డిజైన్‌ను రద్దు చేశారు. అనంతరం బరాజ్ నిర్మాణంలో 282 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రానికి స్థానం కల్పించారు. దీంతో 2006 నుంచి 2016 వరకు ఒకలా, అప్పటి నుంచి 2021 వరకు మరోలా ఈ ప్రాజెక్టు రూపురేఖలు మారిపోతూ వచ్చాయి. ఫలితంగా సీతమ్మ సాగర్ ఫైనల్ డీపీఆర్ చాలా రోజుల పాటు సిద్ధం కాలేదు.

మరోవైపు క్షేత్రస్థాయిలో విద్యుత్ కేంద్రం మినహాయించి మిగిలిన సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మాణ పనులు జరుగుతూ వచ్చాయి. ఈ వివాదానికి సమాంతరంగా ప్రాజెక్టు నిర్వాసితులు సైతం బరాజ్ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చారు. దీంతో ఈ అంశం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లగా.. ఎక్కడి పనులు అక్కడే ఆపేయాలంటూ 2023 మేలో ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది.

గత ఆగస్టు నుంచి ఫోకస్..

ప్రాజెక్టు అనుమతుల వ్యవహారం ఒకవైపు కొనసాగుతుంటే మరోవైపు అప్పటికే నిర్మించిన ప్రధాన కాలువ, పంప్‌హౌస్‌లను ఉపయోగించుకుంటూ పాత ఆనకట్ట ద్వారా నీటిని పొలాలకు తరలించే మరో కొత్త ఉపాయాన్ని కాంగ్రెస్ సర్కార్ అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా రాజీవ్ కెనాల్ తెరపైకి వచ్చింది. దీంతో 2024 ఆగస్టు 15 డెడ్‌లైన్‌గా గోదావరి నీటిని నాగార్జున సాగర్ ఆయకట్టుకు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టుకు మళ్లీ కదలిక తెచ్చారు. డీపీఆర్‌లో లోపాలను సవరిస్తూ మరోసారి సీడబ్ల్యూసీని ఆశ్రయించగా ప్రస్తుతం టెక్నికల్ కమిటీ ఎదుట ప్రెజెంటేషన్ ఇచ్చారు.

రామాలయంలో సహస్ర కలశావాహనం





బేడా మండపం వద్ద అమర్చిన కలశాలు (ఇన్‌సెట్) యాగశాలలో హోమం చేస్తున్న అర్చకుడు

నేడు రామయ్యకు సహస్ర కలశాభిషేకం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో మంగళవారం సహస్ర కలశావాహనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాఘ మాస ఉత్సవాల్లో భాగంగా దేవస్థానంలో సహస్ర కలశాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో మొదట కలశావాహనం జరిపారు. బేడా మండపంలో వెయ్యి కలశాలను వరుస క్రమంలో అమర్చి శాస్త్రోక్తంగా దేవతలను ఆవాహన చేశారు. ఈ సందర్భంగా యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ, హవనం, మండప, వాస్తు పూజలు జరిపించారు. ఈ వేడుకల నేపథ్యంలో స్వామి వారి నిత్యకల్యాణం, పవళింపు సేవ రద్దు చేశారు. కాగా, బుధవారం శ్రీ సీతా లక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామికి సహస్ర కలశాభిషేకం, శ్రీ రంగనాథ స్వామి వార్షిక తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

మాతృ మరణాలను నియంత్రించాలి

డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్ : మాతృ మరణాలను నియంత్రించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. జిల్లాలోని సెకండ్ ఏఎన్ఎంలకు మంగళవారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చిన 12 వారాల్లోపు ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతీ గర్భిణికి పరీక్షలు చేయాలని, ప్రమాదకర వ్యాధులుంటే సకాలంలో పెద్దాస్పత్రికి పంపించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఎన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్‌పీ చైతన్య, డాక్టర్ బాలాజీ, డిప్యూటీ డెమో ఎండీ ఫైజ్‌మొహిఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐఎంఏ ప్రతినిధులు, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతూ.. పరీక్షలకు సంబంధించి ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్లు చంద్రకళ, రత్నమణి, తిరుపతి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న భాస్కర్‌నాయక్

దమ్మపేట పీహెచ్‌సీలో తనిఖీ..

దమ్మపేట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం పలు ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాలు, ఆస్పత్రుల్లోనూ తనిఖీలు నిర్వహించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండలపల్లిలో అధిక మోతాదులో యాంటీబయోటిక్స్, ఇంజెక్షన్లు వినియోగిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుడిని గుర్తించి క్లినిక్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో డీఐఓ బాలాజీ, స్థానిక వైద్యులు మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 27న జరిగే పోలింగ్ ప్రక్రియపై అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. జిల్లా పరిధిలోని ప్రిసైడింగ్, సహాయక ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలు మొత్తం 74 మందికి కలెక్టరేట్‌లో మంగళవారం మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ భిన్నంగా ఉంటుందని అన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. గడువులోగా పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నంబర్లు అందించి వారితో ఓటు వేయించాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లు, బాక్సులను తమ పర్యవేక్షణలో ఉంచుకోవాలని పీఓలకు సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వరాచారి, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీఎల్ఎంటీ సాయికృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్.. వద్దులే ఈ'సారీ'

- కోళ్లకు వైరస్ వ్యాప్తి ప్రచారంతో జనాల్లో భయం
- అమ్మకాలు పడిపోవడంతో పరిశ్రమ కుదేలు
- రూ.80కు దిగిన కిలో కోడి ధర
- ఇంకోపక్క ఏపీ నుంచి దిగుమతి జరగకుండా చెక్‌పోస్టులు



ఓ ఫామ్‌లోని బ్రాయిలర్ కోళ్లు

ఖమ్మంవ్యవసాయం: కోళ్ల పరిశ్రమ(పౌల్ట్రీఫామ్)లకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో వైరస్ ప్రభావం.. ఇక్కడ సైతం వేలాదిగా కోళ్ల మృత్యువాతతో జనాల్లో భయం నెలకొంది. ఈమేరకు చికెన్ వినియోగం తగ్గడం కోళ్ల, చికెన్ ధర తగ్గడానికి కారణమవుతోంది. దీంతో కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు, రైతులు నష్టపోతున్నారు.

మహారాష్ట్ర, ఏపీలో నిర్ధారణ

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కోళ్లకు వైరస్(హైలీ పాతోజెనిక్ అవెన్ ఫ్లూయాంజా) సోకినట్లు ఇప్పటికే నిర్ధారించారు. ఇదే సమయాన ఏపీకి సరిహద్దుగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, అశ్వారావుపేట తదితర మండలాల్లోని పౌల్ట్రీఫామ్‌ల్లోనూ కోళ్లు మృతి చెందాయి. దీనికి వైరస్ కారణమని నిర్ధారణ కాకున్నా ఏపీ నుంచి కోడిపిల్లలు, కోళ్లు, దాణా దిగుమతి అవుతుండడంతో జనాల్లో భయం నెలకొంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం సైతం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూనే, ఏపీ నుంచి కోళ్లు, దాణా రాకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టుల ద్వారా కట్టడి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 20 వేలకు పైగానే..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 20వేలకు పైగానే కోళ్ల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 15లక్షల నుంచి 17 లక్షల మేర కోళ్లను పెంచే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఫామ్స్‌లో 12లక్షల మేర కోళ్లు ఉన్నట్లు అంచనా. ఇందులో బ్రాయిలర్, లేయర్ కోళ్లను పెంచుతుండగా రెండు రకాలకూ వైరస్ సోకే అవకాశముందని సమాచారం.

వినియోగం తగ్గడంతో ధరపై ప్రభావం

వైరస్ ప్రభావం చికెన్ విక్రయాలపై పడింది. ఉమ్మడి జిల్లాలో ఆదివారాల్లో సగటున 40 టన్నుల వరకు, ఇతర రోజుల్లో నిత్యం 25 టన్నుల వరకు వినియోగం ఉంటుంది. ప్రస్తుతం శుభకార్యాల సమయం కావడంతో వినియోగం పెరగాల్సి ఉన్నా 40 శాతం మేర తగ్గిందని కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారు. ఇక కిలో కోడిని రూ.110 చొప్పున రైతులు విక్రయిస్తే కనీసం పెట్టుబడి వస్తుంది. కానీ ఇప్పుడు రూ.80 వరకే ఇస్తున్నా ఆశించిన మేర విక్రయాలు జరగడం లేదు. ఇక స్కిన్‌లెస్ చికెన్ కేజీ ధర రూ.250 నుంచి రూ.300 వరకు పలకగా ఇప్పుడు రూ.180 – రూ.200కే విక్రయిస్తున్నారు. అలాగే, స్కిన్‌తోనైతే రూ.150 నుంచి 170కు అమ్ముతున్నా లాభం ఉండడం లేదని పౌల్ట్రీ ఫాంల నిర్వాహకులు, షాపుల బాధ్యులు చెబుతున్నారు.

నిర్వాహకులను అప్రమత్తం చేశాం

వైరస్ నేపథ్యాన కోళ్ల ఫామ్‌ల నిర్వాహకులను అప్రమత్తం చేశాం. సరైన రసాయనాలతో ఫామ్‌లు శుభ్రం చేయాలని చెప్పాం. ఏపీ సరిహద్దు ప్రాంతాల్లోని పరిశ్రమల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ వి.వెంకటనారాయణ, ఖమ్మం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

జిల్లాకు 'కొత్త' కోటా !

- జనవరి 26న 1,203 మందికి కొత్త రేషన్ కార్డులు
- పాత కార్డుల్లోనూ పలు మార్పులు, చేర్పులు
- ఈనెలలో పెరిగిన బియ్యం 71.52 క్వింటాళ్లు
- ఇంకా కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన



కొత్తగూడెంఅర్బన్: దశాబ్ద కాలంగా రేషన్‌కార్డుల కోసం ఎదురుచూసిన లబ్ధిదారుల్లో కొందరి కల నెరవేరింది. గతనెల 26న గణతంత్ర వేడుకల్లో జిల్లాలో మొదటి విడతగా 1,203 మంది రేషన్ కార్డులకు అర్హత సాధించారని, వారందరికీ ఫిబ్రవరి నుంచే రేషన్ బియ్యం అందజేస్తామని అధికారులు ప్రకటించారు. అయితే జిల్లాలో రేషన్ కార్డులు కావాల్సిన వారు ఇంకా 34 వేల మందికి పైగా ఉండగా వారంతా ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సభలు, ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సిబ్బంది సర్వే కూడా పూర్తి చేశారు. అందులో అర్హతను బట్టి కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో మరో 20వేల రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు లబ్ధిదారులు దరఖాస్తు చేశారు.

అదనంగా 71.52 క్వింటాళ్ల బియ్యం..

జిల్లాలో కొత్తగా 1,203 కార్డులు పెరగగా, పాత కార్డుల్లోనూ పలుపేర్లను తొలగించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు ఈనెల నుంచి జిల్లాలో 71.52 క్వింటాళ్ల బియ్యాన్ని అదనంగా విడుదల చేయాలని నిర్ణయించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లోనూ అర్హులను గుర్తిస్తే ఈ కోటా మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికం కావడంతో జిల్లాలో కార్డులేని వారు దశాబ్ద కాలంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు కాక, ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రుణాలు పొందలేక ఎన్నో అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా 1,203 మందికి కొత్త కార్డులు రావడంతో తమకు కూడా వస్తాయనే నమ్మకం అర్హులైన దరఖాస్తుదారుల్లో ఏర్పడింది.

మార్చి నుంచి సన్న బియ్యం..

ఈ ఏడాది మార్చి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు ఎక్కువ మంది తీసుకోకపోవడం, మరి కొందరు డీలర్లకే విక్రయించి డబ్బులు తీసుకుంటుండడంతో బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఈ దందాను అరికట్టేందుకు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా.. మార్చి నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. ప్రస్తుతం సన్నబియ్యం ధర మార్కెట్‌లో 25 కేజీల బస్తా రూ.1,600 నుంచి రూ.2,000 ఆపైన పలుకుతోంది. అయితే రేషన్‌లో సన్నబియ్యం సరఫరా చేస్తే పలు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

జిల్లాలో రేషన్ కార్డులు, షాపుల వివరాలిలా..

రేషన్‌షాపులు	443
ఆహారభద్రత కార్డులు	2,72,112
అంత్యోదయ కార్డులు	21,148
అన్నపూర్ణ కార్డులు	03
కొత్తగా జారీ చేసినవి	1,203

కొత్తగా 1,203 కార్డులు



జిల్లాలో ఇటీవల 1,203 నూతన రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ఆయా కార్డుల వారికి ఈనెల నుంచే రేషన్ బియ్యం అందిస్తున్నాం. కొత్త కార్డులు రావడం, పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు జరగడంతో జిల్లాలో ఈనెల రేషన్ బియ్యం కోటా 71.52 క్వింటాళ్లు పెరిగింది. ఇంకా పలు దరఖాస్తులకు సంబంధించి పరిశీలన కొనసాగుతోంది.

– రుక్మిణి, జిల్లా సివిల్ సప్లై అధికారి

రైల్వే డబ్లింగ్ లైన్‌కు సర్వే

కారేపల్లి: డోర్నకల్ రైల్వే జంక్షన్ నుంచి కారేపల్లి రైల్వే జంక్షన్ మీదుగా భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) వరకు నిర్మించే డబ్లింగ్ లైన్ కోసం రైల్వే, రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. లైన్ ఏర్పాటులో భాగంగా సేకరించాల్సిన ఇళ్లు, వ్యవసాయ భూముల వివరాలు సేకరించారు. కాగా, కారేపల్లి రైల్వే స్టేషన్ సమీపాన ఇళ్లు కోల్పోనున్న వారు తమకు పరిహారం చెల్లించడమే కాక ఇళ్లు కట్టించి ఇవ్వాలని గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈనేపథ్యాన అధికారులు మరోమారు సర్వే చేయడం చర్చనీయాంశంగా మారింది. రైల్వే జేఈ శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, సర్వేయర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సభ్యులతో వెదురు సాగు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

చుంచుపల్లి: రాష్ట్రంలోని 5 జిల్లాల్లో (భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్) జిల్లాకు వెయ్యి మంది చొప్పున 5,000 మంది మహిళా సమాఖ్య సభ్యులచే వెదురు సాగు ప్రయోగాత్మకంగా చేపట్టనున్నట్లు గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్ణయించిందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో రెండో రోజు ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెదురు సాగుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని చండ్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని, ఈ మండలాల్లోని 1,000 మంది మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించి వారికి వెదురు సాగుపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. వీరికి ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల సరఫరా, నిర్వహణ కోసం నిధులు సమకూర్చుతామని, మొక్కలు నాటిన తర్వాత నాలుగేళ్లకు దిగుబడి ప్రారంభమై 80 ఏళ్ల వరకు వస్తుందని, అందుకు సంబంధించి సర్టిఫికెట్, మార్కెటింగ్‌కు సంబంధించి సెర్ప్, ఇండస్ట్రీ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ నీలేశ్, మూడు మండలాల డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఏపీఓలు, ఉద్యానవన శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు, ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ అధికారులు రమ్య, శ్రీకాంత్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రిషను ఆదర్శంగా తీసుకోవాలి



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: క్రికెట్‌పై ఆసక్తి ఉన్న బాలికలు భారత క్రికెటర్ గొంగిడి త్రిషను ఆదర్శంగా తీసుకొని అంచెలంచెలుగా ఎదగాలని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల స్థాయి అండర్-14 బాలికల క్రికెట్ టోర్నీని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్‌పై ఆసక్తి కలిగి ఉండడమే కాక నిరంతరం సాధనతో మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మహ్మద్ మతిన్, గౌస్, ఉపేందర్, క్రికెటర్లు పద్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చండ్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన ఎం.వినోద్‌పై నమోదైన పోక్సో కేసుపై డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మంగళవారం చండ్రుగొండలోని అంబేడ్కర్‌కాలనీలో విచారణ జరిపారు. దళిత యువతికి మాయమాటలు చెప్పి, రెండేళ్లపాటు లైంగికదాడికి పాల్పడిన కేసులో బాధితురాలితోపాటు కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఏఎస్‌ఐ పాపారావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వనమా వెంకటేశ్వరరావు, లలితకుమారి, కొత్తగుండ్ల మహేష్‌కుమార్, ప్రసన్నదుర్గ, సమయమంతుల హరికృష్ణ, ప్రత్యేషదుర్గ కుటుంబ సభ్యులు రూ.1,11,116 అందించారు. ఆలయ కమిటీ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్..

బూర్గంపాడు: మండలంలోని పినపాక, ఉప్పుసాక గ్రామాల సమీపంలో పొలాల్లో ఉన్న ఇసుక అక్రమ నిల్వలను మంగళవారం డీటీ రామ్‌నరేశ్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. సోమవారం రాత్రి ఉప్పుసాక వద్ద ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో సుమారు 10 ట్రాక్టర్లు, ఒక జేసీబీ అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయని తహసీల్దార్ ముజాహిద్ హెచ్చరించారు.

ఇద్దరికి రెండేళ్ల జైలు

బూర్గంపాడు/భద్రాచలంటౌన్: సారపాక మేజర్ గ్రామపంచాయతీలో రూ.23,89,750 ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై భద్రాచలం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శివనాయక్ అప్పటి పంచాయతీ కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు, సర్పంచ్ ధరావత్ చందునాయక్‌కు రెండేళ్ల జైలుశిక్ష, చెరో రూ.5 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. 2012లో గ్రామపంచాయతీ నిధులు రూ.23.85 లక్షలను అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు జాయింట్ చెక్ పవర్‌తో దుర్వినియోగం చేశారని అప్పటి ఈఓఆర్డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఈదయ్య బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ వినోద్ వీరిద్దరిపై కేసు నమోదు చేశారు. పాల్వంచ సీఐ రమేశ్ విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇద్దరు ముద్దాయిలపై నేరం రుజువుకావడంతో జడ్జి శివనాయక్ ఒక్కొక్కరికీ రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ఏపీపీ శ్రీనివాస్ వాదించగా, డ్యూటీ ఆఫీసర్ బాబు, దుర్గారావు సహకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి



800 మెగావాట్ల కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం

- దేశంలోనే నంబర్-1గా నిలిచిన కేటీపీఎస్ 7వ దశ
- ఇటీవల నిరంతరాయంగా 100 రోజుల మైలురాయి
- దూసుకెళ్తున్న 800 మెగావాట్ల యూనిట్

పాల్వంచ: సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం ఉత్పత్తిలో దూసుకుపోతోంది. ఈ యూనిట్ రోజుకు 19.200 మిలియన్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రాష్ట్రానికి అందించగల సత్తా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12వ యూనిట్ గతంలో దేశంలోనే నంబర్‌వన్ పీఎల్‌ఎఫ్ సాధించిన ఘనత కూడా ఉంది. కాగా, ఇటీవల నిరంతరాయంగా 100 రోజుల మైలురాయిని సైతం దాటడంతో హర్షం వ్యక్తమవుతోంది. గతేడాది అక్టోబర్ 29 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తోంది. అయితే, కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలోని 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9, 10 యూనిట్లు, 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 11వ యూనిట్ గతేడాది 82.10 శాతం పీఎల్‌ఎఫ్ సాధించి టాప్‌లో నిలిచాయి. 2023లో 9వ యూనిట్ 144 రోజులు నిరంతరాయంగా ఉత్పత్తి అందించి చరిత్ర సృష్టించింది. 10వ యూనిట్ 222 రోజుల రికార్డ్‌ను అధిగమించింది.

పలు రికార్డ్‌లు కర్మాగారం సొంతం

- 2020-21, 2021-22 ఏడాదుల్లో 800 మెగవాట్ల కేటగిరిలో కేటీపీఎస్ 7వ దశ అత్యధిక పీఎల్‌ఎఫ్ అందించి దేశంలోనే రెండుసార్లు నంబర్‌వన్ స్థానంలో నిలిచింది.
- 2022-23 ఏడాదిలో దేశంలో రెండో స్థానం సాధించింది.
- 2020 అక్టోబర్ 9వ తేదీ నుంచి 2021 జనవరి 26వ తేదీ వరకు 107 రోజులపాటు నిరంతరాయంగా ఉత్పత్తిని అందించింది.
- 2020-21లో టీజీ జెన్‌కో స్థాయిలో 87.18 పీఎల్‌ఎఫ్‌తో ప్రథమ స్థానంలో నిలిచింది.
- 2021-22లో పీఎల్‌ఎఫ్ 83.52 శాతంతో ప్రథమస్థానం, 2023-24లో 85.54 పీఎల్‌ఎఫ్ సాధించి వరుసగా ప్రథమస్థానం సాధించింది.

సమష్టి కృషితో ఉత్పత్తి



రికార్డ్ స్థాయి ఉత్పత్తి కోసం ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా కృషి చేస్తున్నారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రూపొందించిన 800 మెగావాట్ల కేటగిరిలో గతంలో 107 రోజులు నిరంతరాయంగా ఉత్పత్తి సాధించింది. ఈ సారి 100 రోజులు దాటింది. మరో రికార్డ్ కోసం ప్రయత్నం చేస్తున్నాం.

– శ్రీనివాసబాబు, కేటీపీఎస్ 7వ దశ ఇన్‌చార్జ్ సీఈ

ఏడుగురు మార్కెట్ కార్యదర్శుల సస్పెన్షన్

జాబితాలో భద్రాచలం కార్యదర్శి

వరంగల్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు తేలగా, వరంగల్ రీజియన్‌లోని ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పత్తి కొనుగోళ్ల కోసం జారీ చేసిన టెంపరరీ రిజిస్ట్రేషన్ల(టీఆర్)లో తేడాలు గుర్తించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో భద్రాచలం మార్కెట్ కార్యదర్శి నామాల శ్రీనివాసరావు సహా ఆదిలాబాద్, చెన్నూరు, పెద్దపల్లి, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు కార్యదర్శులు ఉన్నారని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో రైతుల పేరిట దళారులు పెద్ద మొత్తంలో పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. కాగా, పత్తి రైతులు వ్యవసాయ అధికారుల వద్ద విస్తీర్ణం సహా పేర్లు నమోదు చేసుకుంటే పంట అమ్మకం సమయాన మార్కెట్ అధికారులు టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్) జారీ చేస్తారు. ఆపై సీసీఐ కొనుగోళ్లు చేపడుతుంది. ఈ విషయంలో అందిన ఫిర్యాదులతో అధికారులు ఆరా తీయగా వ్యవసాయ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు, మార్కెట్ జారీ చేసిన టీఆర్‌లో తేడా ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు కార్యదర్శులపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

పోడు వివాదం.. పలువురిపై కేసు

అశ్వాపురం: మండలంలోని మనుబోతులగూడెం గ్రామంలో కొంతకాలంగా ఫారెస్ట్ అధికారులకు, గిరిజనులు, వలస ఆదివాసీలకు పోడు వివాదం జరుగుతోంది. రెండు రోజుల కిందట మనుబోతులగూడెం గ్రామానికి వెళ్తున్న మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ఉపేందర్ వాహనాన్ని వలస ఆదివాసీలు అడ్డుకున్నట్లు సమాచారం. దీంతో ఫారెస్ట్ అధికారుల ఫిర్యాదు మేరకు సోమవారం అశ్వాపురం పోలీసులు ఐదుగురు గిరిజనులపై కేసు నమోదు చేశారు. రెండు నెలల కిందట మనుబోతులగూడెంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో సుమారు 60 హెక్టార్ల భూముల్లో కందకాలు తవ్వి చదును చేశారు. పనులను పలుమార్లు గిరిజనులు, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. కందకాలు ఆపాలని గిరిజనులు, ఆదివాసీల పోడు భూములు లాక్కోవద్దని సీపీఎం ఆధ్వర్యంలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సీపీఎం ఆధ్వర్యంలో డిసెంబర్‌లో గిరిజనులు కందకాలు పూడ్చివేశారు. అప్పటి నుంచి ఫారెస్ట్ అధికారులకు, గిరిజనులకు వివాదం కొనసాగుతోంది.

మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోళ్లు జరపాలి

ఖమ్మంమయూరిసెంటర్: మిర్చి ధరలు తగ్గుతున్న నేపథ్యాన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వమే మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గతేడాది ఇదే సమయాన క్వింటా మిర్చి ధర రూ.23వేలు ఉండగా, ఇప్పుడు రూ.14వేలు దాటడం లేదన్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చొరవ చూపి మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యాన 17వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, రాష్ట్రప్రభుత్వం సన్నధాన్యం అమ్మిన రైతులందరికీ బోనస్ చేయడమే కాక అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

మిర్చి బోర్డు ఏర్పాటు చేసి ధరలు స్థిరీకరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి ధరలు పతనమై రైతులు ఆందోళన చెందుతున్నందున ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



సరస్వతి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: దుస్తులు ఆరేస్తుండగా ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురైన ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని కిష్టారానికి చెందిన పానెం సరస్వతి(49) కూలీ పనులే జీవనాధారంగా జీవిస్తుండగా, మంగళవారం ఉదయం ఇంట్లో పని ముగించుకుని కూలీకి వెళ్లాల్సి ఉంది. ఈక్రమాన దుస్తులు ఆరేస్తుండగా అప్పటికే తీగకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురై కేకలు వేసింది. చుట్టుపక్కల వారు చేరుకుని ఆమెను సత్తుపల్లి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందింది. సరస్వతి భర్త రెండు నెలల క్రితమే మృతి చెందగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..

కారేపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ఎర్రబోడుకు చెందిన రైతు పండగ రామయ్య(44) నెల క్రితం కామేపల్లి మండలం ఊట్కూరు నుంచి ఎర్రబోడుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా టాటా మ్యాజిక్ ట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఘటనపై కామేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు

బోనకల్: మండలంలోని 22గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వాహకులు 90మందిపై ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈమేరకు తహసీల్దార్ పున్నంచందర్ ఎదుట మంగళవారం హాజరుపరిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యాన బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

అప్పు తీర్చడం లేదని ఆత్మహత్యాయత్నం

రఘునాథపాలెం: అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన ఎం.చక్రవర్తి అదే గ్రామానికి చెందిన సురేష్‌కు రూ.25లక్షలు అప్పుగా ఇచ్చాడు. అయితే, ఈ నగదు తిరిగి ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురైన ఆయన మంగళవారం పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై చక్రవర్తి భార్య శ్రావణి ఫిర్యాదుతో సురేష్, ఆయన తండ్రి శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

కల్లులో పురుగుల మందు కలిపిన గీతకార్మికుడు

మరో కార్మికుడితో విబేధాలతో ఘటన

కూసుమంచి: కల్లు అమ్మకంలో వచ్చిన విబేధాలతో ఓ గీత కార్మికుడు మరో గీత కార్మికుడి చెట్టుకు ఉన్న కుండలో పురుగుల మందు కలిపిన ఘటన ఇది. కూసుమంచి మండలం జీళ్లచెరువుకు చెందిన మొక్క వీరబాబు, ఐతగాని రమేష్ గీతకార్మికులు. వీరిద్దరి నడుమ ఇటీవల కల్లు అమ్మకంలో విబేధాలు తలెత్తి గొడవలు జరుగుతున్నాయి. దీన్ని మనసులో పెట్టుకున్న రమేష్.. వీరబాబును నష్టపర్చాలనే ఉద్దేశంతో ఈనెల 6న రాత్రి వీరబాబు చెట్టుపై ఉన్న కుండలు మూడింట్లో పురుగుల మందు కలిపాడు. మరునాడు ఉదయం వీరబాబు చెట్టు ఎక్కగా కల్లు పురుగుల మందు వాసన వచ్చింది. దీంతో రమేష్‌పై అనుమానంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారించగా పురుగుల మందు కలిపినట్లు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. కాగా, వీరబాబుకు అనుమానం రాకపోయినా, మందు కలిసిన కల్లు ఎవరికైనా పోసినా పెను ప్రమాదం జరిగేదని చెబుతున్నారు.

యువతి అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని మిట్టపల్లికి చెందిన 22 ఏళ్ల బి.ఝాన్సీ సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. డిగ్రీ పూర్తి చేసిన ఆమె ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు హైదరాబాద్‌లోని ఓ సెంటర్‌లో కోచింగ్ తీసుకుంటోంది. ఇంటికి వచ్చిన ఆమె బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో తల్లి సరోజ ఫిర్యాదు మేరకు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దమ్మపేట: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి శివారులో డబుల్ బెడ్రూమ్‌లో నివాసం ఉంటున్న కొయ్యల పుల్లయ్య (55) సైకిల్‌పై ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో దమ్మపేట నుంచి మందలపల్లి వైపునకు వెళ్తున్న వ్యక్తి బైక్‌తో సైకిల్‌ను ఢీకొట్టాడు. పుల్లయ్య తలకు దెబ్బ తగలడంతో అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి 108 ద్వారా తరలించారు.

అనారోగ్యంతో యువకుడు మృతి..

ఇల్లెందు: పట్టణంలోని నంబర్-2 బస్తీకి చెందిన జార్జ్ హరి (31) మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కావ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్య కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న యువకుడు...



మనోహర్ (ఫైల్)

సుజాతనగర్: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటనపై సుజాతనగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమాదేవి కథనం మేరకు.. మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన కున్సోత్ హత్తీరాం, పద్మ దంపతుల కుమారుడు, ఆటోడ్రైవర్ మనోహర్ (22) మద్యానికి బానిసయ్యాడు. ఆటోకు సంబంధించిన కిస్తీలు సరిగాచెల్లించకపోవడంతో తల్లిదండ్రులు గత నెల 27న మందలించారు. మనస్తాపానికి గురైన మనోహర్ పురుగులమందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పాల్వంచ: దంపతుల మధ్య కలహాల నేపథ్యంలో భార్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పాత పాల్వంచ మంగబావి వీధికి చెందిన కశారు రవిశేఖర్‌కు ఏలూరుకు చెందిన ప్రశాంతి (38)కి 2011లో వివాహమైంది. వీరికి 12ఏళ్ల కూతురు రూపాఐశ్వర్య, పదేళ్ల కొడుకు వెంకట్ అభిరామ్ ఉన్నారు. దంపతులు కలిసి ఇటీవల విజయవాడ బంధువుల ఇంటికి వెళ్లి వచ్చారు. మళ్లీ ప్రశాంతి ఏలూరుకు వెళ్తానని చెప్పడంతో 10వ తేదీ రాత్రి గొడవ జరిగింది. మంగళవారం ఉదయం లేచేసరికి ప్రశాంతి హాల్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించింది. ఏలూరుకు చెందిన ప్రశాంతి బాబాయి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంకుమపూజతో జాతర షురూ..



అమ్మవారి గద్దెల వద్ద భక్తుల కోలాహలం

నాలుగు రాష్ట్రాల నుంచి నేడు భక్తుల రాక

కరకగూడెం: గిరిజనుల ఆరాధ్య దేవతలైన సమ్మక్క, సారలమ్మ జాతర కరకగూడెం మండలంలోని చిరుమళ్ల గ్రామంలో మంగళవారం కుంకుమ పూజలతో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పూజారులు అమ్మవార్ల గుడిని అలంకరించారు. దేవతల వస్తువులు, ఆభరణాలు, గంటలు ఇతర వస్తువులను శుభ్రం చేశారు. ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి, మేలుకొలుపు జరిపి జాతరను ప్రారంభించారు. భక్తులు భారీగా హాజరయ్యారు. చర్ల మండలంలోని ఎదిర గ్రామం నుంచి బుధవారం పగిడిద్దరాజు, కరకగూడెం మండలంలోని వెంకటాపురం నుంచి సారలమ్మను పూజారులు గద్దెలపై కొలువుదీర్చనున్నారు. కాగా, సమ్మక్క జన్మస్థలం చిరుమళ్ల గ్రామం కావడంతో ఈ జాతర ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. చందా వంశస్తులు ఈ జాతరను నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వేలాది మంది ఆదివాసీల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ బుధవారం గుడి ప్రాంగణంలో గిరిజన తెగల ఇలవేల్పుల సమ్మేళనం కనులపండువగా జరగనుంది.

మహిళపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

చుంచుపల్లి: హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న మహిళపై మరో మహిళ దాడి చేసిన ఘటనలో చుంచుపల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. పాల్వంచకు చెందిన ఉపాధ్యాయుడు అజ్మీరా హరిదాస్ భార్య విజయ హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న సోయం కిరణ్మయి ఇంటివద్దకు సోమవారం రాత్రి వెళ్లింది. తన భర్తతో సహజీవనం చేస్తున్నావని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఆమెపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చుంచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

16 నుంచి రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ ఈ నెల 16 నుంచి ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.డీ.మతిన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ఉమ్మడి జిల్లాస్థాయిలో ఈ టోర్నీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా జట్ల బాధ్యులు 93466 24241 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా...

డీసీసీబీల పదవీ కాలాన్ని పొడిగించండి

మంత్రి తుమ్మలకు సహకార బ్యాంకుల చైర్మన్ల వినతి

సాక్షి, హైదరాబాద్: ఈ నెలలో ముగియనున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగించాలని వివిధ జిల్లాల సహకార బ్యాంకుల చైర్మన్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సచివాలయంలో మంగళవారం తుమ్మలను కలిశారు. సీఎంతో చర్చించి పదవీ కాలాన్ని పొడిగించేందుకు కృషి చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మార్నేని రవీందర్ రావు, డీసీసీబీ చైర్మన్లు కుంభం శ్రీనివాస్ రెడ్డి, కొత్తకోట సత్తయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులున్నారు.

రైతులకు అన్ని రంగాల్లో పెద్దపీట : చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సర కాలంలోనే రైతుల సంక్షేమం కోసం రూ.55,256 కోట్లు వ్యయం చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా ద్వారా సుమారు రూ.40 వేల కోట్లు రైతుల ఖాతాలో నేరుగా జమ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రైతులకు మంచి చేయాలనే తపనతో నిరంతరం తపిస్తోందని, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు.

ఆరేళ్లకే నూరేళ్లు

గుండెనొప్పితో బాలుని హఠాన్మరణం


విజయ్ సూర్య(ఫైల్)

గీసుకొండ: గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారానికి చెందిన మడిత్తిల్ విజయ్ సూర్య (6) గుండెనొప్పితో మంగళవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి. ధర్మా రానికి చెందిన బాచి–కల్యాణి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు విజయ్‌సూర్య ఎల్‌కేజీ చదువుతున్నాడు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనానంతరం ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. వెంటనే విజయ్‌సూర్యకు కుటుంబ సభ్యులు ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. కానీ పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చనిపోయాడు.

మినీ మేడారం.. భక్తజన సందోహం

నేటి నుంచే సమ్మక్క – సారలమ్మ జాతర

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి భక్తుల రాక

ఏర్పాట్లు చేసిన ములుగు జిల్లా అధికార యంత్రాంగం



సాక్షి ప్రతినిధి, వరంగల్: మినీ మేడారం (మండమెలిగె పండుగ) జాతరకు వేళయ్యింది. వనదేవతలు సమ్మక్క–సారలమ్మ పునఃదర్శనానికి సమ యం ఆసన్నమైంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర.. తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ముగిసిన ఏడాదికి అదే మాదిరిగా మినీ మేడారం జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి 15వ తేదీ వరకు జాతర జరగనుంది. ఈ జాతర ప్రారంభానికి వారం రోజుల ముందు గుడిమెలిగె నిర్వహించారు.

మండమెలిగె ఇలా..

మేడారంలో నేటినుంచి 15వ తేదీ వరకు మినీ జాతర (మండమెలిగె పండుగ) జరుగనుంది. వారం రోజుల నుంచే భక్తులు తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు.

- 12న (బుధవారం) మేడారం, కన్నెపల్లిలోని ఆలయాల్లో మండమెలిగె పండుగను సమ్మక్క–సారలమ్మ పూజారులు నిర్వహిస్తారు. మేడారంలో సమ్మక్క పూజారులు అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు చేసి గ్రామ పొలిమేరలోని తూర్పు, పడమరన ధ్వజస్తంభాన్ని పాతి మామిడి తోరణాలు కడతారు. రాత్రి సమ్మక్క గుడి నుంచి పూజా సామగ్రిని తీసుకొని సమ్మక్క గద్దె వద్దకు వెళ్లి పూజలు నిర్వహిస్తారు. సారలమ్మ పూజారులు కూడా కన్నెపల్లిలో అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించి రాత్రి మేడారంలోని గద్దెల ప్రాంగణానికి చేరుకొని అలుకుపూత అనంతరం పూజలు చేస్తారు. రాత్రంతా జాగారం నిర్వహిస్తారు.
- 13 (గురువారం)న ఉదయం సమ్మక్క–సారలమ్మ గద్దెల నుంచి పూజారులు అమ్మవారి సామగ్రిని తీసుకొని డోలు వాయిద్యాలతో సమ్మక్క గుడికి చేరుకుంటారు. తలస్నానాలు ఆచరించి గుడిలో మరోసారి పూజలు నిర్వహిస్తారు. కన్నెపల్లిలో సారలమ్మ పూజారులు కూడా సారలమ్మ గుడికి వెళ్లి పూజలు చేస్తారు.
- 14 (శుక్రవారం)న భక్తులు వనదేవతలకు మొక్కులు చెల్లిస్తారు.
- 15 (శనివారం)న జాతర ముగియనుంది.

రూ.32 కోట్లతో భక్తులకు ఏర్పాట్లు..

రూ.32 కోట్లతో మినీ మేడారం జాతరకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు సుమారు 10 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పలు శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టింది.

వానాకాలం ధాన్యం ప్రైవేటు వ్యాపారులకే!

- మిల్లుల నుంచి సేకరించాల్సిన సీఎంఆర్ 36.15 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు సేకరించింది 5.42 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం



సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్ ధాన్యం సేకరణలో పౌరసరఫరాల సంస్థకు నిరాశే మిగిలింది. రికార్డు స్థాయిలో కోటిన్నర మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వచ్చిందని ప్రభుత్వం చెబుతున్నా, కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం మాత్రం 53.96 లక్షల మెట్రిక్ టన్నులే. ఇందులో సన్నరకం ధాన్యం 24 లక్షల మెట్రిక్ టన్నులు. కాగా గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో కూడా పౌరసరఫరాల సంస్థ 47.34 శాతం ధాన్యాన్ని మాత్రమే సేకరించగలిగింది. దేశ, విదేశాల్లో బియ్యానికి పెరిగిన డిమాండ్ దృష్ట్యా వానాకాలం సీజన్‌లో పండిన పంటను కల్లాల నుంచే వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. క్వింటాల్‌కు మద్దతు ధర కామన్ వెరైటీకి రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320 చొప్పున కొనుగోలు కేంద్రాల్లో రైతులకు లభించింది. అదనంగా ఈ వానాకాలం సీజన్ నుంచి సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున ప్రభుత్వం బోనస్‌గా ఇస్తామని చెప్పింది. అయినా వ్యాపారులు, రైస్‌మిల్లర్లు సన్న ధాన్యాన్ని నేరుగా రైతుల పొలాల నుంచే మద్దతు ధర కన్నా అదనంగా ఇచ్చి కొనుగోలు చేసిన పరిస్థితి ఈసారి కనిపించింది. బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, జగిత్యాల, పెద్దపల్లి వంటి జిల్లాల్లో రైతులే నేరుగా ధాన్యాన్ని బియ్యంగా మిల్లింగ్ చేయించి విక్రయిస్తున్నారు. రైతులు సొంత అవసరాలకు కూడా బియ్యాన్ని నిల్వ చేసుకోవడం ఈ సీజన్‌లో సాధారణం. దీంతో వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తగ్గుతూ వస్తోంది. గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో పండిన పంటకు, సర్కార్ సేకరించిన ధాన్యానికి పొంతన లేకుండాపోయింది.

సీఎంఆర్ ఇలా....

వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన 53.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం మిల్లులకు పంపించారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 36.15 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ రూపంలో పౌరసరఫరాల సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటి వరకు కేవలం 5.41 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (15 శాతం) పౌరసరఫరాల సంస్థకు రాగా, మరో 30.73 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. రైస్‌మిల్లులు అధికంగా ఉన్న పెద్దపల్లి జిల్లా నుంచి 42 శాతం సీఎంఆర్‌ను ఇప్పటికే సేకరించారు. తర్వాతి స్థానాల్లో భద్రాద్రి కొత్తగూడెం (39 శాతం), ఖమ్మం (31 శాతం) జిల్లాలు ఉన్నాయి.

రేషన్‌కు అవసరమైన సన్న బియ్యం 24 ఎల్‌ఎంటీ

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఉగాది నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం సరఫరా చేయాలని యోచిస్తోంది. రేషన్ దుకాణాలు, మధ్యాహ్న భోజనం, గురుకుల పాఠశాలలకు సంవత్సరానికి అవసరమయ్యే బియ్యం 24 లక్షల మెట్రిక్ టన్నులు. ఇందుకోసం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అవసరమవుతుంది. కానీ ఈ సీజన్‌లో పౌరసరఫరాల సంస్థ సేకరించిన సన్నధాన్యం 24 లక్షల మెట్రిక్ టన్నులే. ఈ ధాన్యం ద్వారా 16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే పంపిణీ చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో వచ్చే యాసంగి సీజన్‌లో వచ్చే సన్న బియ్యాన్ని కూడా పంపిణీకి వినియోగించుకునే అవకాశం ఉంది. వచ్చే నవంబర్ వరకు వానాకాలంలో వచ్చిన సన్న బియ్యాన్ని సరఫరా చేసి, మిగతా నాలుగు నెలలకు యాసంగి బియ్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉందని పౌరసరఫరాల వర్గాలు తెలిపాయి.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: తక్షణం టెండర్లు పిలిచి తునికాకు సేకరణ పనులు ప్రారంభించాలని అటవీశాఖకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం విజ్ఞప్తి చేసింది. తునికాకు సేకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సంఘం మంగళవారం అరణ్యభవన్ ఎదుట నిరసన తెలిపింది. అనంతరం పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్‌కు సంఘ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ.. ఏటా తునికాకు సేకరణపై ఆధారపడి ప్రత్యక్షంగా ఐదు లక్షల మంది ఆదివాసీలు, గిరిజనులు, గిరిజనేతర పేదలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది తునికాకు సేకరణ ప్రక్రియను ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని ఆరోపించారు.

జనగామ జిల్లాలో నవోదయ ఏర్పాటు చేయండి

కేంద్రానికి ఎంపీ కావ్య విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: జనగామ జిల్లాలో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర పాఠశాల విద్య శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, కేంద్ర నవోదయ విద్యాలయ సమితి కమిషనర్ ప్రాచీ పాండేలను ఆమె కలిసి వినతి పత్రాలు అందజేశారు. నవోదయ ఏర్పాటుకు కావల సిన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తన అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు కావ్య తెలిపారు.

'తెలంగాణ భవన్‌లో సేవాలాల్ జయంతి నిర్వహిస్తాం'

సాక్షి, హైదరాబాద్: గిరిజనులకు సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడని, ఆయన జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్న వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం మొదలైందని, రూ. 25 కోట్ల సేవాలాల్ మహరాజ్ భవన్‌ను కేసీఆర్ కట్టించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో గిరిజనులు అనాథలుగా మారారని, గిరిజన కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయడం లేదని, 14 నెలల్లో పద్నాలుగు పైసల పని కాలేదని వారు ఆరోపించారు. గిరిజనులకు కేటాయించిన బడ్జెట్ కూడా ఖర్చు కావడం లేదన్నారు.

జిల్లా వార్తలు

ఎరువు.. బరువు!

ఖమ్మంలో మూడో రైల్వేలైన్‌తో 'రేక్'పాయింట్ సమస్య

- నిల్వలు లేక అరకొరగా సరఫరా
- అదే అదునుగా డీలర్ల చేతివాటం
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు


ఖమ్మంలోని ఓ డీలర్ పాయింట్‌లో ఎరువుల బస్తాలు


వరి పైరులో యూరియా చల్లుతున్న రైతు

ఖమ్మంవ్యవసాయం: యాసంగి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎరువులు భారంగా మారాయి. ఖమ్మంలో మూడో రైల్వే లైన్ పనులు జరుగుతుండడంతో స్టేషన్‌లోని గూడ్స్ షెడ్‌కు సరఫరా నిలిచిపోయింది. దీంతో నెల రోజులుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు సరఫరా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండడం, సాగర్ నుంచి సైతం నీరు విడుదల చేస్తుండడంతో ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు ఇప్పటివరకు 2,70,605 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న ఉన్నాయి.

రేక్ పాయింట్ సమస్య..

కాజీపేట–విజయవాడ మార్గంలో మూడో రైల్వే లైన్ సిద్ధమవుతోంది. ఈ పనులు ఖమ్మంలో జరుగుతుండడంతో ఖమ్మంలోని రైల్వే గూడ్స్ షెడ్‌ను పందిళ్లపల్లి స్టేషన్‌కు మార్చారు. అయితే, అక్కడికి లారీ యజమానులతో ఒప్పందాలు, హమాలీల సమస్యలు, రవాణా చార్జీలు వంటివి కొలిక్కి రాకపోవడంతో ఎరువుల దిగుమతి జరగడం లేదు.

అరకొరగా సరఫరా..

రేక్ పాయింట్లకు వచ్చిన ఎరువులను మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ చేసి పీఏసీఎస్‌లు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తుంది. ఇప్పుడు ఖమ్మంలోని రైల్వే గూడ్స్ రేక్ పాయింట్ ఎత్తివేయడంతో దిగుమతి నిలిచిపోయింది. పంట సీజన్‌లో నెలకు దాదాపు ఆరు నుంచి ఎనిమిది గూడ్స్ రైళ్ల ద్వారా ఎరువులు సరఫరా అవుతుండగా.. 4 నుంచి 5వ్యాగిన్లలో దాదాపు 2.50లక్షల బస్తాల యూరియా వస్తుంది. ఇప్పుడు రేక్ పాయింట్ రద్దవడంతో మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలు అడుగంటాయి. వరంగల్ నుంచి రోడ్డు మార్గంలో అరకొరగా ఎరువులను సరఫరా చేస్తున్నా అవి ఎటూ సరిపోవడం లేదు. ఖమ్మం జిల్లాలో సాగు విస్తీర్ణం దృష్ట్యా భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు చెందిన ఎరువుల నిల్వలను బదలాయిస్తున్నారు. అయినప్పటికీ పలు ప్రాంతాల్లో ఎరువుల కొరత ఎదురవుతోంది.

డీలర్ల మాయాజాలం

ఖమ్మంలో రేక్ పాయింట్ రద్దు కావడం, సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇదే అదునుగా కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక యూరియా బస్తా ధర రూ. 266గా ప్రభుత్వం నిర్ణయించగా.. కొందరు రూ.330 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. మరికొందరు ఇతర ఎరువులను లింక్‌గా అంటగడుతున్నారనే విమర్శలున్నాయి.

అమల్లో 'రేషన్' విధానం

ప్రస్తుతం యాసంగిలో సాగు చేసిన పంటలకు నత్రజని(యూరియా) అందించాల్సి ఉంటుంది. మార్క్‌ఫెడ్ నుంచి సహకార సంఘాలకు యూరియా సరఫరా చేయాల్సి ఉండగా.. నిల్వలు లేకపోవడంతో వరంగల్ రేక్ పాయింట్ నుంచి కొద్దికొద్దిగా సర్దుబాటు చేస్తున్నారు. ఇక్కడ రేక్ పాయింట్ ఉండి ఉంటే ఫిబ్రవరిలో 2,600 మెట్రిక్ టన్నుల కెపాసిటీ కలిగిన ఐదు నుంచి ఆరు వ్యాగన్లు వచ్చేవి. ఈనేపథ్యాన కొన్నిసొసైటీల్లో ఒక్కో రైతుకు ఒక్కో యూరియా బస్తానే ఇస్తున్నారు. ఫలితంగా మొక్కజొన్న, వరి పైర్లకు సరిపడా యూరియా అందించలేకపోతున్నామని, ఇది దిగుబడిపై ప్రభావం చూపిస్తుందని రైతులు వాపోతున్నారు.

యాసంగి పంటల వివరాలిలా..

పంట	విస్తీర్ణం	యూరియా
వరి	2,14,892	19,350
మొక్కజొన్న	91,227	6,500
పెసర	8,776	200
వేరుశనగ	744	34
మినుము	807	19
మొత్తం	3,16,446	26,103

పడరాని పాట్లు పడుతున్నాం



ఆరెకరాల్లో మొక్కజొన్న వేయగా ప్రస్తుతం యూరియా అవసరం ఉంది. కానీ డీలర్ల వద్ద సక్రమంగా లభించడం లేదు. సొసైటీల్లో విక్రయిస్తున్నా క్యూలైన్ భారీగా ఉంటోంది.

– మండేపూడి కిషన్‌రావు, జగన్నాథపురం, చింతకాని మండలం

అరకొరగా ఇస్తున్నారు..



ఐదెకరాల్లో వరి వేశా. సొసైటీల ద్వారా రేషన్ విధానంలో ఎరువు ఇస్తుండగా, ప్రైవేట్ దుకాణాల్లో ఎక్కువ ధర చెబుతున్నారు. సమయానికి యూరియా వేయకపోతే దిగుబడులు రావు.

– పానుగోతు వెంకన్న, ఎర్రగడ్డతండా, కూసుమంచి మండలం

యూరియా సరిపోవడం లేదు



సహకార సంఘాల్లో ఇచ్చే యూరియా సరిపోవడం లేదు. పొరుగు మండలాలకు వెళ్తే స్థానికులకే ఇస్తామంటున్నారు దీంతో పైర్లకు వేయడానికి యూరియా సరిపోవడం లేదు.


– కొనకంచి గిరిబాబు, పెదమునగాల, కొణిజర్ల మండలం

చర్యలు తీసుకుంటున్నాం



యూరియా కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నాం. పందిళ్లపల్లిలో రేక్‌పాయింట్ మొదలైతే సమస్యలు ఉండవు. ప్రస్తుతం వరంగల్, మిర్యాలగూడ నుంచి ఎరువులు వస్తుండగా, భద్రాద్రి జిల్లా నుంచా తీసుకుంటున్నాం.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి



కూసుమంచిలో జాతీయ రహదారి పక్కన ఓ రైతు చెరకు పంట సాగు చేస్తున్నాడు. పంట రావడానికి సమయం ఉండటంతో అంతర్ పంటగా బంతి నారు నాటించాడు. ఈ పూలు చేతికొస్తుండటం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో మంచి ధర పలుకుతోందని చెబుతున్నాడు. ఫలితంగా చెరకు మొక్కలు ఎదిగే నాటికి బంతి పూల ద్వారా రైతుకు అదనపు ఆదాయం సమకూరనుంది. కాగా, హైవే మీదుగా వెళ్తున్న వాహనదారులను ఈ పూలు కనువిందు చేస్తున్నాయి. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన


విద్యార్థులతో కలిసి పాఠం వింటున్న పీఓ రాహుల్

చర్ల: గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. చర్ల మండలం పెదమిడిసిలేరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడారు. గణితశాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. తొలుత తరగతి గదులు, డార్మెటరీ, వంటశాలలను పరిశీలించిన పీఓ ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు వేదిక్ గణితం బోధనపై ఆరా తీశాక వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఈశ్వర్, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఎం.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పేరు ఘనం.. ఫలితం శూన్యం



పాలేరు రిజర్వాయర్ సమీపాన చేపలు విక్రయించే స్టాళ్లు (ఇన్‌సెట్) చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

- పాలేరులో చేపల మార్కెట్‌కు మోక్షం లేదా?
- అమలుకాని అమాత్యుల హామీలు
- ఫలితంగా మత్స్యకారులు, కొనుగోలుదారుల ఇక్కట్లు

కూసుమంచి: జిల్లాలో పాలేరు రిజర్వాయర్ పేరు చెప్పగానే నూతన విధానాల్లో చేపల పెంపకంపై రెండు రాష్ట్రాల మత్స్యకారులకు అవగాహన కల్పించే మత్స్య పరిశోధనా స్థానం, రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్‌లో చేపల పెంపకం, తెప్పలపై వేటాడే మత్స్యకారులు గుర్తుకొస్తారు. దీంతో సహజంగానే అక్కడ మంచి చేపలు లభిస్తాయని, క్రయవిక్రయాలకు వేదికగా అన్ని వసతులతో మార్కెట్ ఉంటుందని అందరూ భావిస్తారు. కానీ, క్షేత్రస్థాయిలో అలాంటివేవీ ఉండవు. దీంతో అటు మత్స్యకారులు, ఇటు కొనుగోలుదారులు ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నా ప్రతీ ఎన్నికల సమయాన నేతలు ఇచ్చే హామీలు అమలుకు నోచుకోవడం లేదు.

2 వేల మందికి పైగానే..

పాలేరు రిజర్వాయర్ కేంద్రంగా నిత్యం చేపల విక్రయాలు సాగుతుంటాయి. దీంతో ఎక్కడివారైనా పాలేరు చేప రుచి చూడాలని భావించి ఇక్కడకు వస్తుంటారు. రిజర్వాయర్ కేంద్రంగా సుమారు 2 వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. కానీ, అమ్మకాలకు సరైన వేదిక లేక మత్స్యకారులు రిజర్వాయర్ సమీపాన ఖమ్మం – సూర్యాపేట రహదారి పక్కన రేకుల షెడ్లు వేసుకుని విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే పాలేరులో ప్రభుత్వ ఆధ్వర్యాన చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని అమాత్యులు ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదు. దీంతో విక్రయాల్లో పెద్దగా లాభం ఉండటం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

మార్కెట్ ఏర్పాటుతో లాభంయకం

చేపల ఉత్పత్తి ఉన్న చోట మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తే అమ్మకాలు పెరిగి మత్స్యకారులకు ఆర్థిక చేయూత లభిస్తుంది. నిర్ణీత ధరలతో ఒకేచోట ప్రజలు కోరుకున్న చేపలు లభిస్తాయి. అలాగే, ప్రభుత్వం నుంచి సైతం మత్స్యకారులకు ప్రోత్సాహకాలు అందుతాయి. లైసెన్స్‌ల జారీతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశముంది. ఇదంతా తెలిసినా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

మత్స్యకారుల ఆధ్వర్యంలోనే..

పాలేరు రిజర్వాయర్‌లో గతంలో కాంట్రాక్టు వ్యవస్థ ఉండేది. ప్రభుత్వం ఇచ్చిన చేప, రొయ్య పిల్లలు కాకుండా కాంట్రాక్టర్ అదనంగా పిల్లలు పోసి పోషించేవారు. ఆపై చేపలు, రొయ్యలను నాడు మత్స్యకారులు తక్కువ ధరతో కాంట్రాక్టర్‌కు విక్రయిస్తే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. కాగా, కరోనా సమయంలో కాంట్రాక్టర్ వ్యవస్థ రద్దయింది. అప్పటి నుంచి మత్స్యకారులే ప్రభుత్వం ద్వారా కొంత, సొంతంగా ఇంకొంత చేపలు, రొయ్య పిల్లలు పోసి వేటాడి ప్రజలకు విక్రయిస్తున్నారు. ఈ తరుణాన ఇక్కడ మార్కెట్ ఉంటేనే మరింత లాభదాయకంగా మారేది.

నీటిమూటలుగానే హామీలు

మెరుగైన వనరులు ఉన్న పాలేరులో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామని, మత్స్యకారుల అభివృద్ధికి సహకరిస్తామని ప్రస్తుతం మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గతంలో పాలేరు నుంచి ఎన్నికైన ప్రస్తుతం కూడా మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఈ హామీ ఇచ్చిన విషయాన్ని మత్స్యకారులు గుర్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులు స్థలాన్ని కూడా గుర్తించినా మార్కెట్ నిర్మాణం మాత్రం జరగలేదు. ఇప్పటికైనా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని చేపల మార్కెట్ ఏర్పాటు చేయిస్తే పాలేరులో మత్స్యరంగం మరింత అభివృద్ధి చెందే అవకాశముంది.

మార్కెట్ ఉంటే మేలు..

ఇక్కడ చేపల మార్కెట్ ఉంటే మాకు మంచిది. ప్రభుత్వం మార్కెట్ నిర్మించి చేయూత అందించాలి. మార్కెట్‌ను దూరంగా కాకుండా ప్రస్తుతం ఉన్న స్థానంలోనే రిజర్వాయర్‌కు సమీపాన ఏర్పాటు చేస్తే కొనుగోళ్లు పెరుగుతాయి.

–బత్తుల ఉప్పయ్య, మత్స్యకారుడు

ప్రతిపాదనలో ఉంది..

పాలేరులో చేపల మార్కెట్ ఏర్పాటు ప్రతిపాదనలో ఉంది. ఇందుకు సంబంధించి స్థానికంగా గతంలోనే స్థలాలు కూడా పరిశీలించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే మార్కెట్ నిర్మాణానికి వీలుంటుంది.

–శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి